# తప్పు

-ఆప్త చైతన్య

'తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు' అన్నాడు వేమన్న. ఆయన చెప్పింది కొంచెం న్యాయబుద్ధి కలవారిని గురించే. ఆత్మ పరిశీలనను పక్షపాత రహితంగా చేసుకోలేని వారి గురించే ఆయన చెప్పింది.

ఎరిగి ఎరిగీ తమ తప్పును ఏమీ తెలీని ఎదుటి వారిపై వేసే వాళ్ళను ఏమనాలి? ఇప్పుడైతే 'పెద్ద మనుషు'లనాలి. పెద్ద మనుషులు తాము చేసిన పెద్ద తప్పుల్ని చిన్న వాళ్ళపై మోపుతుంటారు. ఆ చిన్న వాళ్ళు అప్పటికే ఎంతో బరువు మోస్తుంటారు కనుక ఆ బరువునూ మోస్తారు. వాళ్ళకు బతుకంటే బరువే కనుక బాధ తెలీదు.

అయితే, ఒకసారి వేసిన తప్పునే ఇంకోసారి ఎదుటి వాళ్ళపైవేసే అవకాశం లేకా, తప్పు మోసే ధైర్యమూ అలవాటూ లేక పెద్దవాళ్ళు కూడా ఒక్కోసారి గిలగిలలాడాలి. అది, దండించే వాడికి పడిన దండన అనుకోవాలా?

ఎముకలు కొరికే చలి. దానికి తోడు రెబ్బ కొండ గాలి...

చీకట్లో చెట్ల కొమ్మలు పూనకం పట్టిన అమ్మోరులాగ వూగుతున్నాయి. ఆ కొమ్మల మధ్య నుంచి గాలి వికృతంగా అరుస్తోంది.

ఇంకా ఆరు కాలేదు. చలికి ఊరంతా ముణగదీసుకుంది.

ఎంకన్న టీకొట్లో, మురళి కిళ్ళీ బడ్డీలో, పోలరాజు కిరాణా దుకాణంలో కిరోసిన్ సీసా దీపాలు మిణుకు-మిణుకు మంటున్నాయి. అది మినహా ఊరంతా నిర్మానుష్యంగా వుంది. ఎక్కడో దూరంగా గుడ్లగూబ అరుస్తోంది.

ఆ ఊరి మధ్యగా పార్వతీపురం నుంచి రాయగడకు రోడ్డు పోతుంది. ఆ రోడ్డుకి కుడి వైపు ఓ మూడు వరుసలు, ఎడమ వైపు ఓ రెండు వరుసల గడప వుంది. చిన్న ఊరే...అంతా కలిపి ఓ యాభై కొంపలు.

ఊరికి మధ్యలో-రోడ్డుకో ప్రక్కగా రామ్మందిరం వుంది. దాని మంటపంలో ఒంటి కన్నులాగ ఓ బల్బు వెలుగుతోంది. దాని చుట్టూ పసర దోమలు ముసురుకుంటున్నాయి.

కొద్ది-కొద్దిగా జనం అక్కడ పోగవుతున్నారు.

మంటపం మెట్లకు కుడి ప్రక్కనున్న అరుగు మీద స్తంభానికానుకొని కూచున్నాడు ప్రెసిడెంటు అప్పన్న దొర. ముప్పై అయిదేళ్ళ వయసు. ఎవరికైనా ఎలుగుబంటి గుర్తుకొస్తుంది అతని ఆకారాన్ని చూస్తే. అంత లావు...అంత నలుపు. ఒక కన్ను లొట్ట బడింది. ఎనుబోతు కొమ్ము సిరిందట అపుడెప్పుడో-కుడికన్ను పోయింది. పాపం, ఎడమ కంటి చూపే. కుడి వైపు మాట్లాడే వ్యక్తిని చూడాలంటే మొత్తం తలకాయని ఆ ప్రక్కకి తిప్పి చూస్తాడు కాకిలాగ.

మంటపానికి ముందర కార్తీక శుద్ధ ఏకాదశినాడు వేసిన పందిరి...ఇంకా అలాగే వుంది. ఆ పందిరి రాటకు ఆనుకొని మంగి నిల్చుంది. పైట చెంగు భుజాల చుట్టూ చుట్టుకొని, చెంగు చివరలో వెచ్చదనం కోసం ముక్కునూ మూతినీ కలిపి అరచేత్తో దవడలు పట్టుకుంది. ఎటూ ఎవర్నీ చూడలేక నేల చూపులు సారిస్తోంది.

ఆమె కాళ్ళ దగ్గర చింకి దుప్పటి నిండా కప్పుకొని మోకాళ్ళ మీద గుబుకాన్ని ఆన్చి, కాళ్ళ చుట్టూ చేతులు కట్టుకొని నత్తలా ముడుచుక్కూచుంది మంగి తల్లి గంగి. ఆమె దృష్టి -మనసు పొరల్లో కూరుకుపోయింది.

మరో నలుగురు మెంబర్లు అప్పన్న దొర వెనుక మంటపం అంచున కూచున్నారు. ఊరి వాళ్ళు దుప్పట్లు కప్పుకొని పందిరి కిందకు చేరుతున్నారు. వాళ్ళలో కొందరు పెద్దలు చుట్టలు కాలుస్తూ దట్టంగా పొగపైకి ఒదుల్తుంటే మరికొంతమంది అంత హుందాగా పైకి వదిలే ధైర్యం లేక అడ్డ పొగేసి చుట్టలు కాల్చుకుంటున్నారు.

వాతావరణమంతా గంభీరంగా వుంది. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు జరగబోయేదాన్ని ఊహించుకుంటూ చుట్టలు కాల్చుకోవడమో, లేదంటే అప్పుడప్పుడూ దగ్గుతుండడమో తప్ప మరే మాటా మంతీ లేదు.

"ఏద్రా సిమ్మాద్రీ?...ఇంకా రాలేదు...ఏటి సేస్తన్నాడు?" అని అప్పన్న దొర తలారి వైపు చూశాడు విసుగ్గా.

'సిమ్మాద్రి' అంటే పాలేరు సిమ్మాద్రి-తల్లీ, తండ్రీ ఎవ్వరూ లేరని అప్పన్నదొర చేరదీసిన సిమ్మాద్రి.

"తవరు పాలు పితికేసి రమ్మన్నారటండీ అన్లో!" అన్నాడు తలారి తల గోక్కుంటూ.

తలకు చుట్టుకున్న తుండు గుడ్డను తీసి, దులిపి భుజమ్మీద వేసుకుంటూ వచ్చాడు సిమ్మాద్రి.

"దండాలండీ" అధికార పూర్వకమైన హోదాకు దండం పెట్టాడు సిమ్మాద్రి.

సిమ్మాద్రిని ఓరగా చూసిన మంగి కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

సిమ్మాద్రికి ఆ కళ్ళలోని నీరు కనిపించలేదు. పంకరింపుగా నవ్వి వూరుకున్నాడు.

మంగి కుమిలి పోతోంది.

'దానికి బగమంతుడు నోరివ్వలేదుగానీ...దాని కేట్రా సక్కని పిల్ల-కొండమల్లి పువ్వులాగుంటాది...". మంగి గురించి పెద్దవాళ్ళు అనుకునే మాటలిలా వుంటే-

"నోరు లేకపోతే పోనాదిగానీ దానెవ్వా దాన్ని సూత్తుంటే గొంతుకలో జల పడతాదిరా..." యువకుల వ్యాఖ్యలిలా సాగిపోతుంటాయి.

'నోరు లేన్ది! దాన్ని అమాంతం మింగేసినట్టు నలుగురూ సూడ్డవేగానీ పెల్లాడతానని ఒక్కనాయాలా అన్డు...!' అని వాపోతుంటుంది గంగి.

'...అమ్మా! మాలతమ్మా! మంగి పసిగుడ్డు అనైనా ఆలోసించకండా అది నెల బిడ్డప్పుడే ఆడు (భర్త) నన్నొదిలి ఎలిపోతే నా రెక్కల కష్టంతో బతకటం నేర్చుకున్నానుగానీ నిన్నేటి అడగలేదు. అయినా మా నోటికి అయిదేళ్లా అందినట్టు సేసినావు. అలాగే దానికి మంచి మొగుడ్ని సూడు తల్లీ...' అని మాలతమ్మకి తన గోడు చెప్పుకునేది గంగి.

తన కోరిక తీరిందంటూ సంబరపడి మాంతమ్మ గుళ్ళో కొబ్బరికాయ కొట్టి-'తల్లీ సల్లగ సూడు తల్లీ. నా కూతురు పనిసేసుకుంటున్న అప్పన్నదొర బావు యింట్లోనే దానికో నీడ సూపించేవు. సిమ్మాద్రిగాడి మనసు దాని మీద పడ్డట్టు సేసేవు. అంతే సాలు... నీ గుడి ముందే ఆల పెళ్లి జరిగిపోవాల. మమ్మల్ని సల్లగ కాపాడు తల్లీ' అని మొక్కింది గంగి.

మొన్నామధ్య కూనేరు సంత నుంచి మంగి కోసం ప్రత్యేకంగా ఓ గుండ్రని అద్దం సిమ్మాద్రి పట్టుకు రావడం గంగి గమనించింది. ఆ అద్దంలో తన ముఖాన్ని చూసుకొని మంగి ఎంత మురిసిపోయిందో అంతగానూ మురిసిపోయింది గంగి కూతుర్ని చూసి.

అప్పన్న దొర చిన్నగా దగ్గేసరికి అది ప్రారంభ సూచికని గ్రహించి అంతా దగ్గటం ఆపేశారు. మరింత నిశ్శబ్దమైపోయి చెవులు రిక్కించి అప్పన్న దొరవైపు దృష్టిని కేంద్రీకరించారు.



ఉత్తరాన మబ్బుపట్టే ఉరుముతున్నట్టు గొంతు పెగిల్చాడు అప్పన్నదొర.

"మన వూళ్ళో ఎవురికే సమస్యొచ్చినా... అదెంత సిన్నదైనా - సిటుకుదైనా... ఇద్దిగిదా ఈ మండపానికి రావాల్సిందే... అదిక్కడ తీరిపోవాల్సిందే. ఆ సంగతి మీ అందరికీ తెలీదని కాదు నాను సెప్తుంది. అది సిన్నింటి సిక్కైనా, పెద్దింటి బాగోతవైనా ఇక్కడ సిక్కులిప్పుకోవాల్సిందే. అంతే కదా మరి... అసలా మాటకొస్తే ఇది నాయింటి నాసొంత సమస్యే అయినా ఇక్కడ మీ పది మంది ముందెట్టడానికి నాను సిగ్గుపడను. ఇది మన గేయానికి మనవిచ్చుకున్న గౌరం..."

అంతా వూపిరి బిగబట్టి వింటున్నారు. ఒక్కసారి చుట్టూ పరికించి చూసి మళ్ళీ ప్రారంభించాడు అప్పన్నదొర.

"...అందుకే ఇది నా సొంత యవ్వారవే అయినా నాకు నేను తీర్పిచ్చుకోడం ఇష్టం లేక మీ అందరి ముందుకు తీసుకొచ్చాను..."

ఈ విషయమై ముందుగా మెంబర్లతోనూ చర్చించ లేదు అప్పన్నదొర. నేరుగా సభాముఖంగా సమస్య నెత్తుకునే సరికి ఆ మెంబర్లకూ బోధపడక; ప్రజల్లాగా ఏవీ తెలియనట్టు ముఖం పెట్టలేక; తెలిసినట్టు నటించనూ లేక మధ్యస్తంగా అప్పన్నదొర మాటలు వింటున్నారు.

"...ఈడు... ఈ సిమ్మాద్రిగాడు ఎవుడు? ఎవుడో ఆ సంగతి మీ అందరికీ తెలుసు. ఆడు తప్పు చేస్తే అది నాను సేసినట్టే కదా! అప్పుడది నా యింటి యవ్వారవే అవుద్ది గదా... అందుకే దీన్ని మీ ముందు పెడతన్నాను..."

ఎవరికీ అర్థం కాలేదు సిమ్మాద్రి తప్పు చెయ్యడమేమిటని.

సిమ్మాద్రికీ అర్థం కాలేదు. పెదవి మీద చిరునవ్వు మాయమై ముఖం గంభీరమై పోయింది.

"గంగీ! ఇక్కడ పెద్దలందరూ వున్నారు. నీకు బెంగక్కర్లేదు. మంగికేటి జరిగిందో యివరంగా సెప్పు.. పర్లేదు... నాయెం జరిగేట్టు నాను సూత్తాను... సెప్పే..."

మంగి చీర చెంగును నోట్లో కుక్కుకొని కుమిలి పోయింది.

గంగి చెప్పడానికి తటపటాయించింది. అప్పన్న దొర దగ్గర కూతురు పని చేస్తుంది గనుక అతనితో చెప్పుకోగలిగింది కానీ యిలాగా పది మంది కూడిన పంచాయతీలో చెప్పాలంటే ఒంటి నిండా తేళ్ళు జెర్రులూ పాకుతున్నట్టనిపించింది. గొంతు పెగల్లేదు.

"సెప్పు గంగీ!" రెట్టించాడు అప్పన్నదొర

"తవకి సెప్పుకున్నాను కదా బావ్!" అని మాత్రం అనగల్గింది గంగి.

"నువ్వు నా ఒక్కడితో సెప్పిస్తే సాల్దే. పది మందికీ తెలియాల. పది మందికి తెలియాల్సిన పన్లేదనుకుంటే యింటి దగ్గిటే ఆడి సెర్మం ఒలిసేసి సంగతి తేల్చేద్దును... ఊరి గౌరం నా ఒక్కడితోనే లేదే... ఈ పదిమంది మద్దిన వున్నాది - పది మంది మద్దినే తేలాల..." వున్న ఒక్క కన్నునీ పెద్దది చేసి కోపంగా అన్నాడు.

కాసేపటికి తనని తాను సంభాళించుకొని "సర్లే... నేనే సెప్తాను... ఇదిగో అందరూ యినండి. యియ్యాల పొద్దుట నాను పల్లకర నేసుకుంటంటే ఇదిగో ఈ గంగి లగెత్తుకొచ్చినాది. 'ఏటే ఏటీ?! పెద్ద పులవు పడినట్టు లాగా లగెత్తుకొత్తన్నా వేటి?' అనడిగాను. 'బావూ! ఏటి సెప్మంతావ్ బావూ. నా కూతురు తప్పుసేసింది బావ్ - కాల్జారింది. తెల్లారిన కాడ్నుండి ఒకటే డోకులు... డోకీ డోకీ కళ్ళు తిరిగి పడిపోనాది. మనూరు మంత్రసాన్ని పిలుసుకొత్తే ఆయమ్మ అసలు సంగతి సెప్పింది...' అని ఏడ్చుకుంటూ సెప్పింది గంగి..."

ఒక్క క్షణం ఆగి అందరి ముఖాల్లోకి చూపులు సారించి చూశాడు. అంతా మంత్రించినట్టు కొయ్యబారి పోయి వింటున్నారు. సిమ్మాద్రి గుండె తప్పెట ముళ్ళ శబ్దంలాగ దడదడలాడుతోంది. రాటకి చేరబడి కుమిలిపోతున్న మంగిని గుచ్చి గుచ్చి చూశారు.

అప్పన్నదొర మళ్ళీ అందుకున్నాడు.

"...మంగీ నిప్పులాంటి ది నాకు తెల్సు. అది తెల్సిసేసినే తప్పు కాదిది. ఎవుడో దాన్ని మాయ సేసి, మంత్రవేసి వల్లో ఏసుకొనుండాల. ఎవడై యుంటాడని గంగనడగాను. అద సెప్పలెక సెప్పలేక ఇదిగో ఈ సిమ్మాద్రిగాడి పేరు సెప్పింది. నేనదిన్నాక ఈ సిమ్మాద్రిగాడి మీద పడి గొంతు పిసికి సంపేయాలన్నంత కోప వొచ్చింది. కానీ... కానీ... సంపెత్తేటొత్తాది? మంగి బతుకేట యిపోద్ది? అని ఆలోచించాను. ఆడ్ని పిలిసి అడిగితే అబద్ద వాడేసి తప్పించుకోలేడు గానీ యిలాగా పది మందిలో నిలబెట్టే నిలదీత్తె గానీ బుద్ధిరాదని ఈ పని సేశాను"

సిమ్మాద్రి గుండె భగ్గుమంది.

అంతలో అతనికి పకీరు గుర్తుకొచ్చాడు,

పకీరు అప్పన్నదొర పిన్నమ్మ కొడుకు. ప్రక్కవూరు చోళపదం నుంచి వచ్చాడొకసారి. రెండ్రోజు

లున్నాడు. ఆ పకీరు మంగిని చూసే చూపు దేగ చూపు - ఆ చూపే అతడంటే సిమ్మాద్రికి అసహ్యం కలిగించింది.

ఓ సాయంత్రం మంగి ఏటికెళ్ళి అప్పన్నదొర కల్లం మీదుగా నీళ్ళు మోసుకొస్తోంది. ఆ కల్లాన పకీరు గుంటనక్కలాగ కాసుక్కూచున్నాడేమో సరిగ్గా మంగి అక్కడికొచ్చేసరికి దారికడ్డంగా నిలబడి వికారంగా నవ్వేడు. మంగి పక్కకు తప్పుకోబోతే చెయ్యి పట్టుకున్నాడు. అదే సమయానికి కర్రలు కొట్టి మోసుకొస్తున్న సిమ్మాద్రి కంట్లో పడి పోయిందా దృశ్యం. కర్రల మోపు ప్రక్కన పడేసి పకీరు మీదకి గొడ్డలెత్తాడు.

"మా అయ్యగోరి తమ్ముడివైపోనావ్ గనక బతికిపోనావ్... లేకపోతే ఈ పాటికి నీ తల మొండెం నుండి ఏరైపోయి ఎగిరవతల పడేది ఆ" సిమ్మాద్రి ఉగ్రరూపం చూసి జడిసి పారిపోయాడు పకీరు.

పొలం నుంచి వస్తూ అప్పన్నదొర యిదంతా చూశాడన్న సంగతి సిమ్మాద్రికి తెలియదు.

భయంతో వణికిపోతున్న మంగిని మెల్లగా నడిపించుకొని యింటికొచ్చేశాడు సిమ్మాద్రి.

ఆ సంఘటన గుర్తుకొచ్చి సిమ్మాద్రి గుండె గుభగుబలాడింది.

సిమ్మాద్రి అంత ఉద్రేకం లోనూ ఆలోచిస్తున్నాడు - తన గురించి కాదు. తనది ఏ తప్పూ లేదని రుజువు చేసుకోవాలనీ అనుకోవడం లేదు. ఏ పాపమూ ఎరుగని మంగి? దాని బతుకిలాగ పది మందిలో నవ్వుల పాలైపోవడం భరించలేక పోతున్నాడు.

రాటనానుకొనే నేల మీదకు జారిపోయి మోకాళ్ళలో తలదాచుకొని వెక్కిళ్ళతో గాలికి అల్లల్లాడుతోన్న ఆకులాగ వణికి పోతున్న మంగిని జాలిగా చూశాడు.

"... మీరే ఆడ్ని అడగండి - అడిగి సంగతేదో తేల్చండి" అని అప్పన్న దొర రెండు చేతుల్నీ అరుగు మీద వుంచి భుజాల మధ్య తలను వేలాడేశాడు.

మెంబర్లలో ఓ పండు ముసలాయన గొంతు సవరించుకున్నాడు.

"ఏరా సిమ్మాద్రీ... మాట్లాడవేట్రా? మంటి బుక్కడం లాగ్గాగ సూత్తావేటి? పెసిరెంటు సెప్పిందానికి ఒప్పుకుంతన్నావా నేదా? తప్పు సేశానంతావా? లేదా?" నిలదీశాడు.

సిమ్మాద్రి తల దించుకుని మౌనంగా నిలబడి పోయాడు.

నలుగురూ నాలుగుసార్లడిగారు. సిమ్మాద్రి నుంచి ఏ జవాబూ రాలేదు.

వాడి మౌనాన్ని తప్పు ఒప్పుకున్నట్టు భావించి, అందరూ కలసి ఓ నిర్ణయానికొచ్చారు.

ఫలితంగా - పది మందిలో సీతారాముల వారి ముందు సిమ్మాద్రి - మంగిల పెళ్ళి ఆ నిముషంలోనే జరిగిపోయింది.

** ** **

ఓ సాయంత్రం...

పొలం నుంచొచ్చాడు సిమ్మాద్రి.

అప్పన్న దొర యింటి పెరట్లో ముద్ద మందారం చెట్టుకింద ఏడస్తూ కూచున్న మంగి కనిపించింది. ఎంతసేపు ఏడ్చిందో కళ్ళు వుబ్బి ఎర్రగా వున్నాయి.

దగ్గరగా వెళ్ళి ఆమెను చేతుల్లోకి తీసుకున్నాడు సిమ్మాద్రి.

"ఏటయ్యిందే మంగీ! ఎందుకలాగేడుస్తావ్ - ఊరుకో... ఏడుసుకుంటా సేతులు ముడుసుకుని కూసోకు - ఆడెవడో సెప్పు... నీకన్నేయం చేసినోడెవడైనా... ఆడెవికలేరేస్తాను - కొంకు రిరగ దన్నీ పోతే నా పేరు సిమ్మాద్రే కాదు..." మంగిని చూస్తేనే చాలు సిమ్మాద్రి గుండె అగ్ని పర్వతమై పోతుంది.

మంగి సిమ్మాద్రి గుండెల మీద వాలి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఓదార్పుగా ఆమె తల నిమిరాడు.

"ఊరుకో ఆ దేవుడు నీకు నోరివ్వకుండా పెద్ద తప్పు సేస్సేడు..." అంటూ ఆమె చేతిలోని అద్దం చూశాడు. అది కిందపడి పగిలింది గాబోలు ముక్కలైంది. అప్పుడర్థమయింది. మంగి అంతలా ఎందుకు కుమిలి పోతుందో

"అద్దం ముక్కలైపోనాదనా? పోన్లే యిది కాకపోతే మరొకటి కొంటాన్లే... ఏడకు" పసిపాపను ఓదార్చుతున్నట్లు అన్నాడు.

అంతలో -

"ఓలె పెంటమ్మా! అమ్మి ఒచ్చినాది ఇంట్లోకి తీసుకెల్లే" వీధిలోంచి అప్పన్నదొర పెళ్ళాన్ని కేకేసి పిలుస్తున్నాడు.

'అమ్మి' అంటే అతడి చెల్లెలు పద్మ... పట్నంలో చదువుతుంది.

ఆ కేక విని సిమ్మాద్రి, మంగి గబగబా వాకిట్లోకి పరుగెత్తుకెళ్ళారు.

పద్మ చేతిలోని బ్రీఫ్ కేసు అందుకున్నాడు సిమ్మాద్రి.

ఆమె నుంచి ఏ సమాధానమూ లేదు. నిర్లిప్తంగా వుందామె వైఖరి. ముఖంలో కనీసం చిరునవ్వైనా లేదు.

ప్రయాణ బడలిక మీద అలసి పోయుంటాదని సర్ది చెప్పుకొని సిమ్మాద్రి బ్రీఫ్ కేసు నట్టింట్లో పెట్టి పెరట్లో కెళ్ళి పోయాడు.

"ఏటమ్మా అలాగున్నావు... ఒంట్లో బాగో లేదా?" పెంటమ్మ మాటల్ని కూడా పట్టించుకోకుండా పడక గదిలో కెళ్ళి మంచం మీద బోర్లా పడిపోయింది. దిండులో ముఖం పెట్టి వెక్కిళ్ళు పెట్టింది. అది చూసి పెంటమ్మకు గాబరా పుట్టింది. గబగబా గడపలోకి వచ్చింది.

"ఇదిగో నిన్నే ఇట్రా... బేగిరా" వీధిలో కెళ్ళి పోబోతున్న అప్పన్న దొరని కేకేసి పిల్చింది.

లోనికొచ్చాడు అప్పన్నదొర.

"పట్నం నుంచొచ్చినదాన్ని పలకరించి కూచొని మాట్లాడ్డం వుందా లేదా? అలాగెల్లి పోడవేనా? చావ పడినట్టుంది సూడు ఎలాగేడుస్తుందో" అంటూ పడగ్గదిలోకి దారి తీసింది.

"ఏటయ్యిందే పద్దూ... ఏటయ్యిందే... ఏటలాగ సేరబడి పోనావ్ - ఒంట్లో బాగోలేదా యేటి?" తల మీద చెయ్యేసి నిమిరి అడిగాడు.

"... ... ..."

"ఎల్లే, నువ్వు కాపీ సేస్ట్రా - నాను మాట్లాడతానుగాని"

పెంటమ్మ వంటగదిలో కెళ్ళి పోయింది.

అంతవరకు అక్కడే నిలుచున్న మంగి పెంటమ్మ వెనకాలే పెరట్లో కెళ్ళి పోయింది.

అప్పన్న దొర పద్మను శత విధాలా బ్రతిమలాడాడు. లాభం లేకపోయింది.

గడపలోకెళ్ళి వాలు కుర్చీలో కూలబడిపోయాడు.

కాఫీ గ్లాసుతో పెంటమ్మ పద్మ దగ్గరకెళ్ళింది. గ్లాసు ఆ పక్క స్టూలుమీద పెట్టి రెండు చేతుల్తో పద్మ భుజాలు పట్టుకుని నెమ్మదిగా కుదిపి అంది - "లేమ్మా... ఏటిది సంటి పిల్లలాగ..." నోట్లో మాట నోట్లోనేవుంది - పద్మ రివ్వునా లేచి బావురుమంటూ పెంటమ్మను చుట్టుకుపోయింది.

................

అరగంట గడిచి పోయింది.

మెల్లగా బయటకొచ్చింది పెంటమ్మ. అప్పన్న దొర చెవిలో ఏదో చెప్పింది దిగ్గునా లేచాడు అప్పన్నదొర.

"ఎవుడాడు?"

"దాంతోనే సదూకుంటన్నాడట"

"ఎక్కడుంటాడు?"

"బొంబాయెల్లిపోయాడని సెప్తంది"

అప్పన్నదొర ముఖం ఎర్రబడింది. కాసేపు ఏదో ఆలోచించాడు.

"మంత్రసానికి కబురెట్టి తీయించెద్దాం"

"దానికి ఒప్పుకోకుంటన్నాది"

కోపంతో జుత్తు పీక్కున్నాడు అప్పన్నదొర.

"నువ్వలాగ కోపవైపోకు - నిదానంగా ఆలోసించు. తప్పు జరిగాక దాన్నుంచీ బైట పడేదారి సూడాల" అని లోనికెళ్ళి పోయింది పెంటమ్మ.

ఆ వాలుకుర్చీలో అలాగే చాలా సేపు కూచుండి పోయాడు అప్పన్న దొర.

ఆ తరువాత లేచి నెమ్మదిగా పెరట్లోకెళ్ళాడు.

సిమ్మాద్రి గొడ్లకు గడ్డేస్తున్నాడు.

మంగి కసవు వూడుస్తోంది.

సిమ్మాద్రిని చూస్తున్న అప్పన్నదొర కళ్ళలో ఏదో ఆలోచన కదుల్తోంది.

"అప్పుడు నేను సేసిన తప్పును నీ మీద యేస్తే మోస్తన్నావు! లేకపోతే, ఇప్పుడు నా సెల్లెలు సేసిన తప్పును మోసేవాడివి. ఆ అవుకాశం ఇప్పుడు పోగొట్టుకుంటే, తప్పయి పోయెగదరా" అన్నట్టుంది ఆ ఆలోచన. ●